క్లుప్తంగా

నేడు ఈపూరు తిరునాళ్ల



ఈపూరు: మండల కేంద్రంలోని బోటిమీద ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల శుక్రవారం జరగనుంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారికి మొక్కుబడులు తీర్చుకునేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి విద్యుత్ ప్రభలు నిర్మించడం లేదు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ బందోబస్తు నిర్వహించనున్నారు.

ఘనంగా మానసిక వికలాంగుల దినోత్సవం

శావల్యాపురం: ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత సెంటరు నందు వరల్డ్ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బిళ్లా రాజారమేష్ గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఎంఈవో మద్దికుంట సాంబశివరావు మాట్లాడుతూ భవిత సెంటరు నందు ఫిజియో. థెరిఫీ స్పీచ్ థేరిఫి నిర్వహించుతున్నట్లు చెప్పారు. ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి మాట్లాడుతూ భవిత సెంటరు నుంచి పదోవ తరగతి పరీక్షలకు నలుగురు విద్యార్థులు హాజరు అవటం పలువురికి ఆదర్శమన్నారు. అనంతరం భవిత సెంటరు విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్ రెడ్డి, పార్వతి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాతులూరు ఎంపీటీసీ పాటిబండ్ల మృతి



పాటిబండ్ల రాజేశ్వరి (ఫైల్)

నాదెండ్ల: సాతులూరు-2 ఎంపీటీసీ, గ్రామ వైఎస్సార్‌సీపీ మహిళా నేత పాటిబండ్ల రాజేశ్వరి (68) మృతిచెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో గత ఎన్నికల్లో ఆమె పోటీ చేసి భారీ ఓట్ల మెజార్టీతో ఎంపీటీసీగా గెలుపొందారు. ఆమె భర్త పాటిబండ్ల రఘుపతి బాబు గ్రామానికి చెందిన ఐదుగురు అయ్యప్ప మాలాధారులతో కలిసి 2011 డిసెంబర్‌లో శబరిమలై వెళ్తూ సేలం వద్ద జరి గిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరికి ఇరువురు కుమారులు కాగా, ఒకరు బ్యాంకు ఉద్యోగిగా పని చేస్తున్నారు. మరో కుమారుడు పాటిబండ్ల శేఖర్ వైఎస్సార్ సీపీ గ్రామ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. రాజేశ్వరి మృతి సమాచారం తెలుసుకున్న చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్ రావు, ఎంపీపీ తలతోటి రాణి, మాజీ సర్పంచ్ పోపూరి వింధ్యారాణి, నాయకులు గద్దె కోటేశ్వరరావు, ఆంజనేయులు నివాళులు అర్పించారు.

పేకాట రాయుళ్ళు అరెస్టు

వినుకొండ (నూజెండ్ల): పేకాట స్థావరంపై దాడిచేసి, ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ గురువారం పేర్కొన్నారు. నూజండ్ల మండలం బుర్రిపాలెం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి, పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 86వేల రూపాయల నగదు, 7 ద్విచక్ర వాహనాలు, 7 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

జగనన్నా.. దాహం తీరిందన్నా..

గతంలో వినుకొండ పేరు చెబితే తాగునీటి సమస్యే అందరికీ గుర్తుకు వచ్చేది. ఇక్కడ తాగడానికి గుక్కెడు మంచినీరు కూడా అప్పట్లో కరువయ్యేది. ఓ బిందెడు నీళ్ల కోసం ఎన్నో కష్టాలు, కొట్లాటలు, పానీపాట్లు.. అన్నీ వినుకొండ వాసులు చవిచూశారు. ఇప్పుడా పరిస్థితి లేదు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగనన్న, శాసనసభ్యులు బ్రహ్మన్నలు మంచినీటి సమస్య తీరుస్తామంటూ వినుకొండ వాసులకు హామీ ఇచ్చారు. ఆ హామీని నేరవేర్చడంతో ఇవాళ ప్రతిఇంటికీ కావాల్సినన్ని మంచినీళ్లు పుష్కళంగా వస్తున్నాయి. జగనన్న హయాంలోనే తాగునీటి సమస్యకు పరిష్కారం లభించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

- వినుకొండలో తీరిన తాగునీటి సమస్య
- మండు వేసవిలో నిత్యం తాగునీరు
- ప్రతిరోజూ తాగునీరు అందిస్తున్న పురపాలక సంఘం



నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్



వినుకొండకు తాగునీరు అందించే సింగరచెరువు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో గతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఎన్ని ప్రభుత్వాలు మారినా తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో తాగునీటి సమస్యపై దృష్టిసారించారు. దీంతో మండు వేసవిలో కూడా ప్రతిరోజూ పురపాలక సంఘం తాగునీరు అందించేస్థాయికి చేరింది. రానున్న రోజుల్లో రెండు పూటలా తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఏఐఐబీ సహకారంతో..

పల్నాడు జిల్లాలోని వినుకొండ పురపాలక సంఘంలో ఏఐఐబీ సహకారంతో తాగునీటి పథకం పనులు చేపట్టారు. వినుకొండ మున్సిపాలిటీకి రూ.166.11 కోట్లు నిధులతో తాగునీరు అందించేందుకు ప్రభుత్వం పనులు ప్రారంభించింది. ఇందులో భాగంగా వినుకొండ పట్టణానికి మూడు ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, రూ.27 కోట్ల నిధులతో పట్టణంలో నూతన పైపులైన్ నిర్మాణం, రూ.125 కోట్ల నిధులతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌తో పాటు పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు పనులు ప్రారంభించారు.

200ఎకరాల విస్తీర్ణంలో స్టోరేజీ ట్యాంక్

వినుకొండ సింగరచెరువుకు అనుసంధానంగా దొండపాడు చెరువు నుంచి మరో 200ఎకరాల విస్తీర్ణంలో స్టోరేజీ ట్యాంక్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పట్టణంలోని రెడ్డినగర్, ధర్మపురికాలనీ, రైలుపేట, కల్యాణపురి కాలనీ, అంబేద్కర్ నగర్, సిద్ధార్థనగర్‌తో పాటు శివారు ప్రాంతాల ప్రజల కు రానున్న రోజుల్లో ప్రతి రోజూ తాగునీరు అందిస్తా రు. ప్రస్తుతం నాలుగు నెలల పాటు తాగునీటి సరఫరా అందించేందుకు సరిపడా వ్యవస్థ మున్సిపాలిటీకి ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏడాది పొడవున తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానుంది. దీంతో వినుకొండలో సుమా రు లక్షకు పైగా జనాభాకు తాగునీటి సౌకర్యం అందుబాటులో రానుంది.



పైపులైన్ నిర్మాణానికి ఉపయోగించే పైపులు

తాగునీటికి ఇబ్బంది లేదు



వినుకొండ పట్టణానికి గతంలో తాగునీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించారు. వేసవిలో కూడా తాగునీరు అందించడం చాలా సంతోషంగా ఉంది.

–ముగ్గూరి జోజమ్మ, 19వ వార్డు

బ్రహ్మన్న చేసిన మేలు మరచిపోం



పట్టణానికి తాగునీరు అందించే సింగరచెరువును ఆక్రమణలు తొలగించి 270 ఎకరాలు విస్తీర్ణం పెంచారు. ఏఐఐబీ నిధులతో పట్టణంలో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణంతో పాటు పైపులైన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ఇప్పటికే తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించారు. బ్రహ్మన్న చేసిన మేలు మరచిపోం.

–బద్దిగ వెంకట నరసింహారావు, 16 వార్డు

నేటి నుంచి ఎమ్మెల్యే బొల్లా ఎన్నికల ప్రచారం

వినుకొండ(నూజెండ్ల): ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఉదయం 7 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 28వ వార్డు నుంచి ప్రచారాన్ని ఆయన మొదలు పెట్టనున్నారు.

నేడు మూడో వార్డులో ఎన్నికల ప్రచారం

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి పట్టణంలోని మూడువార్డు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం గురువారం తెలియచేసింది. దీనిలో పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత విద్య కోసం అర్జీలు స్వీకరణ

శావల్యాపురం: జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు మేరకు విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయివేటు పాఠశాలలో ఉచిత విద్య కోసం ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కె.వి.ఆర్. మోహన్‌చందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలకు ప్రవేటు పాఠశాలలో 25 శాతం సీట్లు కేటాయించారని, ఆసక్తి కలిగిన వారందరు మండల కేంద్రం శావల్యాపురం శ్రీరామా పబ్లిక్ స్కూల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోడ్ అమలులో అందరూ జాగ్రత్తగా ఉండాలి



బొల్లాపల్లిలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వరదా సుబ్బారావు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి స్థానిక అధికారులతో చర్చిస్తున్న డీఎస్పీ వర్మ



తూబాడులో సచివాలయం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్



రొంపిచర్లలో మాట్లాడుతున్న తహసీల్దార్

పులిచింతల ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్, వినుకొండ అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేక అధికారి వరదా సుబ్బారావు

బొల్లాపల్లి : సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో పులిచింతల ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ వినుకొండ అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేక అధికారి వరదా సుబ్బారావు గురువారం సమావేశం నిర్వహించారు. మే 13న ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఎన్నికల కోడ్ అమలులో ఉందని, సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండి ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోని వారు ఏప్రిల్ 15లోపు నూతనంగా ఓట్లు నమోదు చేసుకోవచ్చున్నారు. నూతన ఓట్లు చేర్చుకునేందుకు మాత్రమే అవకాశం ఉందని, ఫారం 7, 8లను దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదన్నారు. ఎన్నికల నియమావళికి సంబంధించి అప్పగించిన విధులను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ నాయకులు, పార్టీలతో సంబంధం లేకుండా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత పోలింగ్ సిబ్బందేనని, పోలింగ్ బూత్‌లో సిబ్బందికి అసౌకర్యానికి గురికాకుండా చూడాలన్నారు. ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు, వీడియో గ్రాఫర్లు, పోలీసుల మధ్య ఓటింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనుమతులు తప్పనిసరని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అంతే కాకుండా ఎన్నికల సమయంలో ఫిర్యాదులు స్వీకరించేందుకు కంట్రోల్ రూంఏర్పాటు చేసి, 08646-272000 నెంబరును కేటాయించామని, ఎన్నికలు జరిగే తీరును ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు గమనిస్తాయన్నారు. ఫిర్యాదు అందుకున్న 100 నిముషములలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వి.రమణరావు, ఎంపీడీవో వి.ఎ.విజయ కుమార్, బండ్లమోటు ఎస్ఐ డి. చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరు గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన

శావల్యాపురం: మండలంలోని శానంపూడి, ముండ్రువారిపాలెం,పోట్లూరు గ్రామాల్లో ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి పర్యటించారు. ఎన్నికల కోడ్ నిబంధనలు తదితర వాటిపై పర్యవేక్షణ చేయటంతో పాటు అన్నీ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, రాజకీయ నాయకులు విగ్రహాలకు ముసుగులు వేయటం తదితర వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ముండ్రు మనోహర్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

రొంపిచర్ల: మండలంలో కొనకంచివారిపాలెం, గోగులపాడు, రామిరెడ్డిపాలెం, రొంపిచర్ల తదితర సమస్యాత్మక గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలను గురువారం నరసరావుపేట డీఎస్పీ వి.యస్.ఎస్ వర్మ పరిశీలించారు. ఆయా గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. సమస్యాత్మక గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నామని డీఎస్పీ వర్మ తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ సీఐ మల్లిఖార్జున, ఎస్ఐ కె.పి. రవీంద్రబాబు, పోలింగ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సిబ్బంది ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని మోడల్ కోడ్ ఆఫ్‌కాండక్ట్ అధికారి, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ చెప్పారు. తూబాడు, చందవరం, సాతులూరు గ్రామాల్లో ఆయన కోడ్ అమలు తీరును తనిఖీలు నిర్వహించారు.

నియమావళిపై సమీక్ష

రొంపిచర్ల: మండలంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా తప్పకుండా అమలు పరచాలని తహసీల్దార్ ఎస్. ఉషారాణి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమాళిపై వీఆర్వోలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అభ్యర్థుల ప్రచారం, గ్రామాల్లో అనుమతులు లేని పోస్టర్‌లు, ఫ్లెక్సీలు, జెండాల తొలగింపు అలాగే అభ్యర్థుల ప్రచారాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు



చెరువు పరిశీలిస్తున్న మనోహర్‌నాయుడు

చిలకలూరిపేట: వేసవిలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు చెప్పారు. పట్టణానికి మంచినీరు సరఫరా చేసే రెండు చెరువులను మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఇతర నాయకులతో కలసి గురువారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు ఎప్పటి వరకు సరిపోతాయో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చెరువుల్లో ఉన్న మంచినీరు ఏప్రిల్ చివరి వరకు సరిపోతాయని వెల్లడించారు. ఈ లోగా ఎన్‌సీపీ కెనాల్స్ అధికారులతో చర్చించి నీటి నిల్వలు ముగిసేలోగా సాగర్ జలాలు రప్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరాల విశ్వనాధం, కౌన్సిలర్లు షేక్ యూసుఫ్ ఆలి, వడితే కోట్యా నాయక్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, కార్యదర్శి మారుబోయిన నాగరాజు, నాయకులు సాపా సైదావలి, ములకలూరి నాగూర్ మీరా, శౌంరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు మనకే ఉంది...

యడ్లపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలని చిలకలూరిపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు చెప్పారు. మండలంలోని రెండు గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం కాలనీలోని పార్టీ నాయకులు అన్నలదాసు శ్యాంపాల్, కుడారి జాన్సన్ నివాసాలకు వెళ్లి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు.

జీవకోటి మనుగడకు చెట్లు ఎంతో ముఖ్యం



కళాశాలలో మొక్క నాటుతున్న రామచంద్రరావు

వినుకొండ టౌన్: జీవకోటి మనుగడకు చెట్లు ఎంతో దోహదపడతాయని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్. రామచంద్రరావు పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని, పట్టణంలోని శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సృష్టిలోని సకల జీవకోటి బ్రతకాలంటే గాలి అవసరమని, అటువంటి గాలినిచ్చే చెట్టను, పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైన ఉందన్నారు. అంతే కాకుండా చెట్లు నాటడం వలన కలిగే మరిన్ని ప్రయోజనాలను, కళాశాల ఆవరణలో మొక్కలను నాటి విద్యార్థులకు వివరించారు.

అనంతరం వెల్లటూరు రోడ్డులో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నగరవనాన్ని సందర్శించి, పనులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్, డిప్యూటీ రేంజ్ అధికారి సురేంద్రబాబు, ఫారెస్ట్ బీట్ అధికారి, అటవీ శాఖ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలశాఖ అధికారుల దాడులు



దుకాణాల్లో తూనికలు పరిశీలిస్తున్న ఎంఎస్ఎన్ మాధురి

చిలకలూరిపేటటౌన్: తూనికలు, కొలతల శాఖ అధికారులు గురువారం పట్టణంలోని పలు దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిబంధనలు పాటించని షాపులపై 47 కేసులు నమోదు చేశారు. గుంటూరు జిల్లా తూనికలు, కొలతల శాఖ సంయుక్త అధికారిణి ఎంఎస్ఎన్ మాధురి ఆధ్వర్యంలో పట్టణంలోని చికెన్, మార్కెట్, కిరాణా, బంగారం దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలం చెల్లిన కాటాలను వినియోగించరాదని, ప్రతి ఏడాది కొలత పరికరాలను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. బియ్యం 25 కేజీలలో బ్యాగుల్లో తూనికల్లో వ్యత్యాసం కనిపిస్తుందని, వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. దాడుల్లో గుంటూరు జిల్లా తునికలు, కొలతల శాఖ ఉపసంయుక్త అధికారి షాలేమురాజు, శాఖ అధికారులు కొండారెడ్డి, అల్లూరయ్య, ఇన్స్పెక్టర్లు శివశంకర్, సునీల్‌రాజ్, జాన్ సైదా, శేషసాయి పాల్గొన్నారు.

అభ్యుదయాన్ని ప్రకటించేదే కవిత

వర్సిటీ అకడమిక్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: మానవజాతి ఆశయాలను, అభ్యుదయాన్ని ప్రకటించేదే కవిత అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ ప్రొఫెసర్ ఈదర శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక పల్నాడు కళాక్షేత్రంలో గురువారం సాయంత్రం శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ కవిత దినోత్సవంలో ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రాచీన కాలం నుంచి ఆధునిక యుగం వరకు కవిత ఆవిర్భావం, లక్షణాలు, శైలి తదితర అంశాలను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రంగస్థలి కార్యదర్శి షేక్ బాజీ, రచయిత గంధం యాజ్ఞవల్క్యశర్మ, పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి, అచ్చుల సుబ్బారావు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో...

అంతర్జాతీయ సాంస్కృతిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి గుండాల రాకేష్ ఆధ్వర్యంలో ప్రపంచ కవిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి యువ కవులను సత్కరించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ, తెలుగు భాష సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నేటి తరం చిన్నారులకు తెలుగు పద్యం, వచన ప్రక్రియలు, సామెతలు తెలియ చేయాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో వేదిక పల్నాడు జిల్లా యూత్ అధ్యక్షురాలు పఠాన్ కరిష్మా, ఉపాధ్యక్షురాలు షేక్.హాఫీ, అమరలింగేశ్వర రావు, ప్రసన్నలక్ష్మీ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక బలగాల కవాతు



లాలిపురంలో రూట్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

బొల్లాపల్లి: సార్వత్రిక ఎన్నికలు మే 13న జరగనున్న దృష్ట్యా ముందస్తుగా గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో వినుకొండ రూరల్ సీఐ యు.సుధాకర్ ఆధ్వర్యంలో మండలంలో రూట్ మార్చ్ గురువారం నిర్వహించారు. మండలంలోని వెంకటరెడ్డిపురం, లాలిపురం, మర్రిపాలెం, గుమ్మనంపాడు తదితర గ్రామాల్లో కవాతు నిర్వహించి ప్రజలతో ఎన్నికల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని, ఇందుకు సంబంధించి పోలీసుల బందోబస్తు ఉంటుందని తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల పట్ల గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.